తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
20-10-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 45 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## టాస్ పబ్ పై పోలీసుల దాడి

■ కస్టమర్లు, యువతులు అరెస్టు

జయభేరి, హైదరాబాద్:

హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని.. టాస్ పబ్పై వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా యువతులతో పబ్లో అసభ్యకరమైన నృత్యాలు చేయిస్తుండగా.. పోలీసులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. పబ్కు కస్టమర్లను ఆకర్షించేందుకు 42 మంది యువతులతో నిర్వాహకులు అసభ్యకరమైన నృత్యాలు చేయిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. అశ్లీలంగా డ్యాన్సులు చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు పబ్పై కేసు నమోదు చేశారు. దాడి చేసిన సమయంలో పబ్లో మొత్తం 100 మంది పురుషులను... 42 మంది మహిళలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. పబ్ కు వచ్చే కస్టమర్లకు ఎరగా యువతులు పబ్ నిర్వాహకులు ఈ యువతులను పబ్ కు వచ్చే కస్టమర్లకు ఎరగా వేస్తున్నారు. కస్టమర్లతో చనువుగా ఉంటూ డాన్సులు వేస్తూ వారితోనే పాటు మద్యం సేవిస్తున్నట్లు నటిస్తారు. కానీ వారు తాగేది కూల్ డ్రింక్స్ మాత్రమే... కానీ కస్టమర్ లతో మాత్రం మద్యం తగుతున్నట్లు నమ్మిస్తారు. చివరిగా వారి బిల్లులోనే యువతులు తాగిన బిల్లును కలిపి కస్టమర్ల జేబులకు చిల్లుపెడుతున్నారు.




2 లో

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారి నిర్వహించిన పోలీస్ డ్యూటీమీట్ ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రాజాబహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ఈ వేడుకలో పోలీసులకు వారు దిశానిర్దేశం చేశారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో అనుసరించాల్సిన విధి విధానాలపై రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

## దేశానికే గర్వకారణం తెలంగాణ పోలీసులు

■ రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడే ఖాకీ సైనికులు
■ పెట్టుబడుల సాధనకు భరోసా కల్పించే శాంతిభద్రతకు ప్రతినిధులు

జయభేరి, హైదరాబాద్ :

పోలీసు శాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ట్రోఫీలు అందజేశారు. మొదటి బహుమతి పొందిన టీమ్కు రూ. 5 లక్షలు, రెండో బహుమతికి రూ3 లక్షలు, మూడో బహుమతిగా రూ. 1.5 లక్షల నగదు అవార్డును ప్రకటించారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు తెలంగాణ పోలీసు శాఖకు స్ఫూర్తినిచ్చే విధంగా డ్యూటీ మీట్ కార్యక్రమం నిర్వహించినందుకు ఈ సందర్భంగా ఆ శాఖను అభినందించారు. నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్ లో కూడా తెలంగాణ పోలీసులు ...మిగతాది 2 లో

## రష్యాకు ప్రధాని మోడీ



జయభేరి, న్యూఢిల్లీ అక్టోబరు 19:

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి రష్యా పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 22, 23 తేదీల్లో కజాన్ వేదికగా 16వ బ్రిక్స్ సమ్మిట్ జరగనున్నాయి. ఈ సందర్భంగా మోదీని స్వయంగా పుతిన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశానికి కదలనున్నారు.ఇక గడిచిన నాలుగు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ రష్యాకు వెళ్లడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఉక్రెయిన్పై రష్యా యుద్ధం తర్వాత మాస్కోలో తొలిసారిగా ఈ ఏడాది జులైలో ప్రధాని పర్యటన చేపట్టారు. అప్పుడు 22వ భారత్-రష్యా శిఖరాగ్ర భేటీని నిర్వహించారు. ఇంకోవైపు రష్యాలోని భారత సంతతి ప్రజలతో మోదీ భేటీ కావడం గమనార్హం. 'ప్రపంచ అభివృద్ధి, భద్రత కోసం ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టి దాన్ని బలోపేతం చేయడం' అనే థీమ్తో ఈ సమ్మిట్ ...మిగతాది 2 లో

## దేశంలో జమిలి ఎన్నికలకు అంతా సిద్ధం



జయభేరి, న్యూఢిల్లీ అక్టోబరు 19:

భారత మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన తుది నివేదికను కేంద్రానికి అప్పగించినప్పట్నించి ఎప్పుడు జమిలి ఎన్నికలుంటాయా అనే చర్చ నడుస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా జమిలి ఎన్నికలు నిర్వహించే దిశగానే అడుగులు వేస్తోంది. జమిలి ఎన్నికల్లో భాగంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధమౌతోంది. రామ్నాథ్ కోవింద్ కమిటీ జమిలీ ఎన్నికలో అధ్యయనం చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. జమిలి ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలో మొత్తం 5 ఆర్టికల్స్ సవరించాలని తెలిపింది. ఇందులో భాగంగా ఆర్టికల్ 83, 85, 172, 174, 356 సవరించాల్సి ఉంది. ఈ బిల్లులు పార్లమెంట్ ఉభయసభల్లో మూడోవంతు ...మిగతాది 2 లో



## తమన్నా జైలు తప్పదా..?

జయభేరి, కోహినూరు, అక్టోబరు 19:

హెచ్పీజెడ్ క్రిప్టో కరెన్సీ పేరుతో మల్టీ క్రోర్ స్కాం జరిగినప్పుడు దేశంలో సంచలనం సృష్టించింది. భారీ ఎత్తున లాభాలు వస్తాయని..బిట్ కాయిన్స్ మైనింగ్ చేస్తామని ప్రచారం చేసుకున్న HPZ టోకెన్ అనే సంస్థ మోసాలకు పాల్పడింది. ఈ సంస్థపై మొదట నాగాలాండ్ లో కేసు నమోదు అయింది. హెచ్పీజెడ్ టోకెన్ సంస్థ ప్రత్యేక యాప్ ను సిద్ధం చేసి అసలు లేని క్రిప్టో కరెన్సీ మైనింగ్ మెషిన్స్ మీద పెట్టుబడి పెట్టాలని ప్రజల్ని నమ్మించింది. ఈ సంస్థ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి మనీలాండరింగ్ కు పాల్పడినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులోనే తమన్నా భాటియాను ఈడీ విచారణకు పిలిచి ప్రశ్నించింది. అయితే తమన్నా ఈ స్కాంలో నేరుగా ఎక్కడా పాల్గొనలేదు.కానీ హెచ్పీజెడ్ సంస్థ నుంచి ఆమెకు కొన్ని పేమెంట్స్ అందాయి. ఆ పేమెంట్స్ కేవలం ఆ సంస్థ నిర్వహిచిన ఈవెంట్స్ పాల్గొనేందుకు చేసినవి. ఈ అంశంపై ప్రశ్నించేందుకే ఈడీ ఆ ...మిగతాది 2 లో

## విద్యార్థులకు.. పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట

■ జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని నిరుద్యోగుల ఆందోళన
■ నిరుద్యోగులకు కేంద్రమంత్రి బండి సంజయ్ బిజెపి శ్రేణులు మద్దతు
■ బండి సంజయ్ను పోలీసులు అదుపులోకి తీసుకున్న పోలీసులు

జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 19:



గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్నగర్లో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు శనివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి నిరసనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఛలో సెక్రటేరియట్కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళన కాస్త తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.ఎట్టిపరిస్థితుల్లోనూ సెక్రటేరియట్ కు వెళ్లి తీరతామని బండి సంజయ్ స్పష్టం చేశారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ...మిగతాది 2 లో

## లోకేష్ 2.0

ఒక రాజకీయ నాయకుడికి అంశాల మీద పట్టు ఉండాలి. ప్రజా సమస్యల మీద అవగాహన ఉండాలి. వాటన్నింటికి నుంచి రాజకీయ చతురత ఉండాలి. ఇలాంటప్పుడే ఆ రాజకీయ నాయకుడు లోని అసలు కోణం ప్రజల్లోకి వెళ్తుంది. అలాంటి సందర్భం నారా లోకేష్ నుంచి ఆవిష్కృతమైంది. ఇటీవల పలు జాతీయ మీడియా సంస్థలు నారా లోకేష్ ను ఇంటర్వ్యూ చేశాయి. ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహించాయి.



జయభేరి, విజయవాడ, అక్టోబరు 19:

సహజంగానే ఒక రాజకీయ నాయకుడికి చిరాకు పెట్టే ప్రశ్నలు వేయడానికి పాత్రికేయులు ఎప్పుడూ ముందుంటారు.. దానికి జాతీయ మీడియా మినహాయింపు కాదు.. ప్రఖ్యాత ఎన్డీటీవీ, టైమ్స్ నౌ వంటి చానల్స్ రాహుల్ గాంధీ.. అఖిలేష్ యాదవ్ ను ఉద్దేశించి ప్రశ్నలు అడిగితే.. దానికి లోకేష్ వ్యూహ చతురతతో కూడిన సమాధానాలు ...మిగతాది 2 లో

## త్యాగాలు చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది



■ భిన్నత్వంలో ఏకత్వంగా
■ భారతీయ ఐక్యతే లక్ష్యంగా
■ పని చేసిన చరిత్ర కాంగ్రెస్ ది

జయభేరి, హైదరాబాద్ :

మురికికూపంలో మగ్గిపోతున్న నిరుపేదలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం చేపట్టిన ప్రాజెక్టు, జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన హైడ్రా వ్యవస్థ రెండు వేర్వేరని విడమరిచి చెప్పారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర సంస్మరణ కమిటీ చార్మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ రాజీవ్ ...మిగతాది 2 లో

జనరల్ న్యూస్
jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ పోలీసులు

రాణించాలని ఆకాంక్షించారు. అందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు.దేశంలోనేమిగతాపోలీసులకుఆదర్శంగానిలువాలనికోరారు.సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల రవాణా వంటి కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలను అరికట్టడానికి పోలీసులుమరింతఅప్రమత్తంగావ్యవహరించాల్సినఅవసరంఉందనిసూచించారు. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటి ఎంతో మంది త్యాగాలను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదు. పోలీసు ఉద్యోగం జీవనోపాధి కోసం చేసే ఉద్యోగం కాదు. ఇదొక భావోద్వేగం. పోలీసు కుటుంబాల కష్టం, నష్టాన్ని గమనించే అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభిస్తున్నాం. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నందునే హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగింది. రాష్ట్రంలోకి గంజాయి లాంటి మత్తుపదార్థాలు సరిహద్దు జిల్లాల పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2013 లో కాకినాడలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్ తర్వాత తెలంగాణలో తొలిసారి డ్యూటీ మీట్ నిర్వహణకు అంగీకరించడంపై డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హోం సెక్రెటరీ రవి గుప్తా, డాక్టర్ జితేందర్, ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ (సీఐడీ), శిఖా గోల్ IPS, ఇతర ఉన్నతాధికారులు, వివిధ విభాగాల పోలీసులు పాల్గొన్నారు.

## రష్యాకు ప్రధాని మోడీ

నిర్వహించనున్నారు. దీంతో ప్రపంచ సమస్యలపైనా కీలకమైన చర్చలు చేపట్టనున్నారు. ఇక బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడం, భవిష్యత్ సహకారం కోసం ఈ శిఖరాగ్ర సమావేశం ఉపయోగపడుందని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు చేపడతారని వివరించింది. భవిష్యత్ లోనూ ఇరు దేశాల మధ్య సహకారం కోసం పని చేసేందుకు చర్చించనున్నారు. 2006లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు కలిసి బ్రిక్ గ్రూపును ప్రారంభించాయి. 2010లో సౌత్ ఆఫ్రికా చేరికతో గ్రూప్ పేరు బ్రిక్స్‌గా మారింది. 2024 జనవరిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు వచ్చి చేరాయి. దీంతో ప్రస్తుతం ఈ బ్రిక్స్ గ్రూపులో పది దేశాలు సభ్యులుగా ఉండటం కొసమెరుపు.

## జమిలి ఎన్నికలకు అంతా సిద్ధం

అంటే 67 శాతం మద్దతు ఇవ్వాలి. దాంతోపాటు కనీసం 14 రాష్ట్రాలు ఓకే అనాలి. అప్పుడే ఈ బిల్లు ఆమోదం పొంది జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుంటుంది. ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టవచ్చు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం లభిస్తే 2027 యూపీ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించవచ్చు. ఆ తరువాత కొద్దిరోజుల వ్యవధిలో మున్సిపల్, కార్పొరేషన్, గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపవచ్చు. ఇప్పటికే జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సహా పలువురు స్పందించారు. త్వరలోనే జమిలి ఎన్నికలుంటాయని సంకేతాలిచ్చారు. అయితే ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా, జమ్ము కశ్మీర్ సహా ఇతర రాష్ట్రాలు 23 ఏళ్ల ముందుగానే అసెంబ్లీ రద్దు చేసుకుని ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అటు కాంగ్రెస్ సైతం జమిలి ఎన్నికలకు అంగీకరించడంతో ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని తెలుస్తోంది.

## త్యాగాలు చేసిన చరిత్ర

గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును మాజీ మంత్రి గీతారెడ్డికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ సమగ్రతను కాపడటానికి చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రను స్ఫూర్తిగా తీసుకుని మత సామరస్యాన్ని కాపాడుకుంటూ తెలంగాణ అభివృద్ధికి ముందుకు సాగుతాం. ట్రాఫిక్ నియంత్రణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కలుషితాలను నిలుపుదల చేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరోధించడం వంటి ఎన్నో ప్రజాసౌలభ్యాల కోసం హైడ్రా పనిచేస్తుంది. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారు, 111 జీవోను ఉల్లంఘించిన వారు మాత్రమే హైడ్రాను చూసి భయపడుతున్నారు. మదపుటేనుగులను అణచడానికి అంకుశం తరహాలో హైడ్రా పనిచేస్తుంది. అనుమతులున్న ఆస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సామాన్యులకు అండగా ఉంటాం. మూసీ పునరుజ్జీవం, హైడ్రాను అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. మురికికూపంలో నలిగిపోతున్న నిరుపేదలకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయించి వారి పిల్లలకు మంచి చదువులు అందించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వారు వ్యాపారాలు చేసుకోవడానికి ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నాం. నగరంలోని బోజగుట్ట ప్రాంత వాసుల సమస్యలను పరిష్కరిస్తాం.

## విద్యార్థులకు.. పోలీసులకు మధ్య..

ప్రయత్నించారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రటేరియట్‌కు బయలుదేరిన బండి సంజయ్‌ను తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై మరికాసేపట్లో బీజేపీ ఆఫీసులో బండి సంజయ్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది.

మరోవైపు ఆందోళన చేస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే నిన్న (శుక్రవారం) వారి (గ్రూప్ 1 అభ్యర్థులు) ఆందోళనను అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్ళాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు. కాగా.. గ్రూప్ వన్ మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మరోవైపు గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలైన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. చివరి నిమిషంలో పరీక్ష రద్దు సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిపోయినట్లైంది.

## తమన్నా జైలు తప్పదా..?

మెను పిలిపించింది. ఈ యాప్ విషయంపై తమన్నాపై ఎలాంటి ఆరోపణలు కానీ..మనీ లాండరింగ్ చేసినట్లుగా కేసులు కానీ లేవు. అదే సమయంలో ఈ యాప్ విషయంలో ఆమె ఇన్వాల్వ్ మెంట్ ఉన్నట్లుగా కూడా ఎక్కడా ఈడీ చెప్పలేదు. ఓ ఈవెంట్ కు హాజరవడం వల్ల ఆమెకు అందిన డబ్బు విషయంలో మాత్రమే ప్రశ్నించేందుకు పిలిపించారు. మూడేళ్ల కిందట ఈ కంపెనీపై మొదటి సారి నాగాలాండ్ లోని కోహిమ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అవడానికి నాగాలాండ్ కేంద్రమే అయినా హైదరాబాద్‌లోనూ లింకులు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఆపరేట్ అవుతున్న మూడు చైనీస్ కంపెనీలకు ఈ యాప్ తో సంబంధాలు ఉన్నాయి. ఈ మూడు కంపెనీ హైదరాబాద్ లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద రిజిస్టర్ అయ్యాయి. యాప్ ద్వారా సేకరిస్తున్న నగదును ఈ మూడు కంపెనీల ద్వారా మనీలాండరింగ్ చేశారు. క్రిప్టో కరెన్సీని మైనింగ్ చేయాలంటే పెద్ద పెద్ద యంత్రాలు కావాలని ఆ యంత్రాల కోసం పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని ప్రజల్ని పిచ్చోళ్లను చేశారుఈ యాప్ నిర్వహకులు. అయితే ఇలాంటి యంత్రాలు ఉంటాయని.. వాటిని కొంటామని కూడా ఎక్కడా ఆ కంపెనీ ఎవరికీ చెప్పలేదు. అలాంటి పనులు కూడా చేయలేదు. ఇన్వెస్టర్ల దగ్గర నుంచి నిధులు సేకరించి దారి మళ్లించారు. ఈ కేసులో ఈడీ పూర్తి విచారణ జరిపి 76 చైనా సంస్థలకు సంబంధం ఉందని.. 299 మంది వ్యక్తులు ఈ స్కాంలో పాలు పంచుకున్నారని గుర్తించారు. వీరిలో చైనీస్ నేషనల్స్ దేశం పారిపోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అయితే అప్పటికే చాలా మంది దేశం దాటి పోయారన్న ఆరోపణలు ఉన్నాయి. అంటే ఈ యాప్ మంచిదని తమన్నా ప్రచారం చేసి డబ్బులు తీసుకున్నారు. అదొక్కటే ఆమెను ఈడీ విచారణ వరకూ తీసుకొచ్చింది.

# రాజధాని 2.0 పనులు పున: ప్రారంభం

**అమరావతి రాజధాని నిర్మాణం 2.0 ప్రారంభమైంది. రాయపూడిలో పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. 80 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న అమరావతి నిర్మాణ ఏజెన్సీ సీఆర్డీయే కార్యాలయ పనులను చంద్రబాబు మొదలుపెట్టారు. 2018లో 160 కోట్ల రూపాయలతో సీఆర్డీయే ఆఫీస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది ప్రభుత్వం.. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి.**



**జయభేరి, అమరావతి, అక్టోబరు 19:** ఆగిపోయిన సీఆర్డీయే కార్యాలయ పనులు తిరిగి ప్రారంభించారు సీఎం చంద్రబాబు. ఏడంతస్థుల భవన నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. ఇటీవల జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పనుల ప్రారంభంపై నిర్ణయం తీసుకున్న సర్కార్.. వెంటనే అమలు చేసింది. రాబోయే రోజుల్లో విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని.. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నో ఇబ్బందులు పడ్డామని.. రాజధాని అమరావతి కోసం రైతుల్ని ఒప్పించి వేల ఎకరాల భూమిని సేకరించడం ఒక చరిత్ర అన్నారు. మళ్లీ అమరావతికి పూర్వ వైభవం కచ్చితంగా వస్తుందన్నారు. గత ఐదేళ్లలో కూడా అమరావతికి అడ్డంకులు సృష్టించారని.. రాజధాని ప్రాంత మహిళా రైతుల చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అమరావతికి టాప్ యూనివర్శిటీలు, 10 టాప్ బెస్ట్ స్కూల్స్, 10 టాప్ బెస్ట్ కంపెనీలు రావాలన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. చరిత్ర తిరగరాయడంలో భాగంగా ఈ సభ జరుగుతోందన్నారు. హైదరాబాద్ నుంచి పాలన సాగిస్తే అమరావతి డెవలప్ కాదని భావించామని.. సైబరాబాద్ నిర్మించిన ఘనత టీడీపీదేనన్నారు. హైదరాబాద్‌లో రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టు మొదలు పెడితే విమర్శించారని.. కానీ ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. మొత్తం 54వేల ఎకరాల భూమి అమరావతికి సేకరించామని.. గత ప్రభుత్వం అమరావతి రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టిందని చంద్రబాబు పేర్కొన్నారు. వీరోచితంగా పోరాడి మహిళా రైతులు రాణిరుద్రమలుగా కనిపించారన్నారు. ఉద్యమాలతో ప్రజలను చైతన్యపరిచారని.. ప్రభుత్వం అణగదొక్కే ప్రయత్నం చేసిందని.. అయినప్పటికీ.. వెనకడుగు వేయకుండా పోరాడన్నారు. అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నామని.. అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి నిర్మాణంలో స్పీడు పెంచుతామని తెలిపారు. గ్రీన్‌సిటీగా అమరావతిని నిర్మాణం చేస్తామని.. మూడేళ్లలో అమరావతి పనులు పూర్తి చేయాలని సూచించారు. తన కష్టాలు చూసి వరుణదేవుడు కూడా స్పందించి అండగా ఉన్నాడంటూ సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో టాప్10 విశ్వవిద్యాయాలు అమరావతికి వస్తున్నాయని.. బిట్స్ పిలాని కూడా యూనివర్సిటీ పెట్టడానికి అంగీకరించిందన్నారు. టాప్ హోటల్స్, టాప్ హాస్పిటల్స్ కూడా అమరావతికి వస్తున్నాయన్నారు. రూ.40వేల కోట్లతో 50 పనులకు టెండర్లు పిలిచామని.. వైసీపీ ప్రభుత్వం కారణంగా రూ.7వేల కోట్ల అదనపు భారం ఏర్పడిందన్నారుఒక రాష్ట్రం ఒక రాజధాని అని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చెప్పారు. అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో సీఆర్డీఏ ఆఫీసు పనుల ప్రారంభంతో రాజధాని పునఃనిర్మాణానికి ముందడుగు పడింది. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. కాగా, టీడీపీ హయాంలో రూ.160 కోట్లతో ఏడంతస్తుల్లో సీఆర్డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్ట్ కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో రాజధాని అమరావతి నిర్మాణానికి బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ రాజధాని నిర్మాణం ఊపందుకుంది. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ సర్కారు నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్‌కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రిక్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 'విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం.. ఒక రాజధాని అని ప్రతిచోటా చెప్పాను. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఏపీలో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్‌లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడే వారు ప్రతిచోటా ఉంటారు. అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజహితం కోసం మీరంతా భూములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరించాం. మహిళా రైతులు వైసీపీ ప్రభుత్వంపై గట్టిగా పోరాడారు. అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ వర్శిటీలు వస్తున్నాయి. దేశంలోని టాప్ 10 విద్యా సంస్థల బ్రాంచ్‌లు ఇక్కడికి రావాలి. బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాను. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, అమరావతి మీదుగా బుల్లెట్ రైలు కావాలి. అమరావతి నిర్మాణ పనులు జెట్ స్పీడ్‌తో జరగాలి.' అని చంద్రబాబు పేర్కొన్నారు.

> **దేశంలో టాప్10 విశ్వవిద్యాయాలు అమరావతికి వస్తున్నాయని.. బిట్స్ పిలాని కూడా యూనివర్సిటీ పెట్టడానికి అంగీకరించిందన్నారు. టాప్ హోటల్స్, టాప్ హాస్పిటల్స్ కూడా అమరావతికి వస్తున్నాయన్నారు. రూ.40వేల కోట్లతో 50 పనులకు టెండర్లు పిలిచామని.. వైసీపీ ప్రభుత్వం కారణంగా రూ.7వేల కోట్ల అదనపు భారం ఏర్పడిందన్నారుఒక రాష్ట్రం ఒక రాజధాని అని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు.**

## లోకేష్ 2.0

ఇచ్చారు." రాహుల్ గాంధీని పాదయాత్ర మార్చింది. దానిని నేను నమ్ముతున్నాను. ఆయనలో నేను కొన్ని అంగీకరించని విధానాలు కూడా ఉన్నాయి.. భారత్ అంటే సంక్షేమ మాత్రమే కాదు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉంది. వారిది స్థాయి దాటిపోయిన సంక్షేమం.. అలాంటప్పుడు హామీలు ఇచ్చే సమయంలో కొంచెం జాగ్రత్తగా ఉండాలి.. రాహుల్ గాంధీకి దేశాన్ని నడిపించే సామర్థ్యం ఉందా? లేదా? అనే ప్రశ్నలకు కాలం సమాధానం చెబుతుంది.. ఇక ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి అఖిలేష్ యాదవ్ ఎంతో కొంత మేలు చేశారు. ఆయన తదుపరికాలానికి ముఖ్యమంత్రి అవుతారా? ప్రతిపక్షానికి పరిమితం అవుతారా? అనే ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుంది. మమతా బెనర్జీ అంటే నాకు గౌరవం. ఒక స్త్రీ మూర్తిగా ఆమెను గౌరవిస్తాను. కాకపోతే ఇటీవల బెంగాల్ రాష్ట్రంలో చోటు చేసుకున్న సంఘటనలు ఒకింత ఆమెకు కష్టకాలం.. త్వరలోనే వాటి నుంచి ఆమె బయటపడతారని నమ్మకం ఉందని" నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం నారా లోకేష్ ఎన్డీఏ కూటమిలో ఉన్నారు. జాతీయ మీడియా ప్రముఖంగా ఇండియా కూటమిలోని నాయకుల లోపాలను ప్రశ్నిస్తూ లోకేష్ ఎదుట ప్రశ్నలు సంధించింది. దీనికి నారా లోకేష్ ఒక రాజకీయ నాయకుడి లాగా స్పందించలేదు. ఆకాశం దొరికింది కదా అని విమర్శలు చేయలేదు. ఒక హుందాతనాన్ని ప్రదర్శించారు. నేర్పరితనాన్ని అవలంబించారు. అందువల్లే జాతీయ మీడియా సైతం ఆయనకు సలాం చేసింది. ఇక చివరిగా నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు సంబంధించి ప్రశ్న ఎదురైనప్పుడు.. లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు.." అది నాకు కష్టకాలం. మా కుటుంబానికి విచారకరమైన సమయం. పార్టీ కూడా ఇబ్బంది పడే సందర్భం. అలాంటి సమయంలో మాకు దేశం నుంచి స్పందన లభించింది. హైదరాబాదులో ప్రజలు కృతజ్ఞతలు చూపించారు. వేలాది మంది ఐటి ఉద్యోగులు ఆయనకు బాసటగా నిలిచారు. చివరికి న్యాయం గెలిచింది. జైల్లో ఉన్నప్పుడు చంద్రబాబు గారిని చూసిన తర్వాత నేను జీర్ణించుకోలేకపోయాను. అంతకుముందు నేను ఎప్పుడు ఎవరినీ జైల్లో వెళ్లి కలవలేదు. తొలిసారి చంద్రబాబును జైల్లో కలిశాను.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాజమండ్రి జైలును అభివృద్ధి చేశారు. ఆయనను కలవడానికి వెళ్ళినప్పుడు అక్కడి అధికారులు ఆ విషయాన్ని చెప్పారు. ఇక ప్రతీకార రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు.. ప్రజలు మాకు ఓటు వేసింది ప్రతీకారం తీర్చుకోమని కాదు.. రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచాలని.. అదే విధానాన్ని మీకు కొనసాగిస్తాం. రెడ్ బుక్ ట్రాప్ లో ప్రతిపక్షాలు ఉన్నాయి. తప్పు చేస్తే కచ్చితంగా శిక్ష పడుతుంది. అందులో ఎటువంటి అనుమానం లేదని" లోకేష్ వ్యాఖ్యానించడం పార్టీ వర్గాల్లో భరోసా నింపుతోంది. మొత్తంగా పాదయాత్ర ద్వారా మరింత పరిపక్వత సాధించిన నారా లోకేష్ 2.0 ను పార్టీ భవిష్యత్తు ఆశాకిరణం లాగా ఆవిర్భవించేలా చేస్తోంది.

# జనవరిలో రైతు భరోసా...



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 19:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇంతకాలం ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న 'రైతు భరోసా'పై కీలక ప్రకటన చేసింది. అతి త్వరలోనే రైతు భరోసా అందిస్తామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిసిస్తుంది. తాజాగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రైతు రుణమాఫీని ఈ నెలలోపు పూర్తి చేస్తామని అన్నారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని వారు 4 లక్షల మంది ఉన్నారని, వారికి కొన్ని సాంకేతిక సమస్యల వల్ల రుణమాఫీ మొత్తం జమకాలేదని అన్నారు. ఈ సమస్యలను పూర్తి చేసిన తరువాత రూ.2 లక్షల పైన ఉన్న వారికి రుణమాఫీని విడతల వారీగా చేస్తామని అన్నారు. అయితే రైతు భరోసా ఎప్పుడు ఇచ్చే అవకాశం ఉందంటే?తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో 'రైతు బంధు' పథకాన్ని తీసుకొచ్చింది.వ్యవసాయ రైతులకు పెట్టుబడి సాయం కింద పంట వేసుకునే ప్రారంభంలోనే అందించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున అందించాలని నిర్ణయించి.. ప్రతీ ఏడాది రెండు విడుదలుగా అందించింది. అంటే ఎకరాకు ఏడాదికి రూ. 10వేలు అందించింది. అయితే గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు రైతు బంధును రూ. 10వేల నుంచి రూ. 15వేలకు పెంచుతామని ప్రకటించారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ ఎస్ ప్రవేశపెట్టిన రైతుబంధును అలాగే అందించింది. ఈ పథకంను ప్రక్షాళన చేయాలని, సాగులేని భూములకు కూడా రైతు బంధు అందుతుందని, అనర్హులను ఏరివేసి అర్హులైన నిజమైన రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని పేర్కొన్నారు. అయితే ఇందు కోసం గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించి రైతు అభిప్రాయాలు సేకరించారు. ఇంతలో రైతు రుణమాఫీ చేయడంతో రైతు బంధును చెల్లించలేదు. రైతులు, ప్రతిపక్షాల నుంచి రైతు భరోసా నిధులపై ఒత్తిడి పెరిగింది. ఈ తరుణంలో అతి త్వరలోనే రైతు భరోసా అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. అయితే రైతు భరోసా పాత వారికే ఇస్తారా? లేదా 5 ఎకరాల్లోపు ఇస్తారా?అనే చర్చ సాగుతోంది. ఎందుకంటే గతంలో సాగులేని భూములకు కూడా రైతు బంధును పొందారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రక్షాళన చేసి అర్హులైన వారికి రైతు భరోసా అందిస్తామని అంటున్నారు. రైతు భరోసాను ఏడాదికి రూ. 15,000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో సగం రూ.7,500 ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం వరికోతలు ప్రారంభం అయ్యాయి. జనవరిలో మళ్లీ పంట వేసేందుకు రైతులు సిద్ధం కానున్నారు. అయితే అప్పుడే రైతు భరోసా నిధులు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. వాస్తవానికి గత పెట్టుబడి సమయంలోనే రూ.7,500 ఇవ్వాల్సి ఉంది. అప్పుడు రుణమాఫీ చేయడంతో ఆ తరువాత ఒకేసారి రూ.15వేలు అందిస్తారన్న ప్రచారం సాగింది. కానీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటనతో రూ.7,500 చెల్లించే అవకాశం ఉంది.

# ప్రజలు లేని చోట పక్కా సడక్

- స్వలాభం కోసమే ఇండ్లు లేని చోట సీసీ రోడ్డు నిర్మాణం
- కార్ల సర్వీస్ సెంటర్ కోసమే సీసీ రోడ్డు నిర్మాణం
- సీసీ రోడ్డు కు మూడు గేట్లు - రెండు హుండాయ్ సర్వీస్ సెంటర్ వి, మరొకటి మేయర్ ఇంటి వెనుక గేట్
- బస్తి / కాలనీ ప్రజల మౌలిక సదుపాయాలకు కార్పొరేషన్ లో డబ్బులు నిల్
- కొన్ని చోట్ల వెట్ మిక్స్ వేసి 3 నెలలు గడిచినా సీసీ వేయని అధికారులు
- అధికార పార్టీ వత్తిడితో కాదు ప్రజల అవసరాలు తీర్చడానికి పని చేయండి - బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి డిమాండ్



జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 20 డివిజన్ పరిధిలో వరంగల్ జాతీయ రహదారిని ఆనుకొని రామచందర్ సింగ్ కాలనీ కి వెళ్ళడానికి రెండు రోడ్లు ఉన్నాయి. అందులో ఒక రోడ్డు లో ఒక్క నివాసిత ఇల్లు లేదు. దాదాపు 500 మీటర్ల సీసీ రోడ్డు 5 మీటర్ల వెడల్పు తో వేయడానికి ఆగమేఘాల మీద వెట్ మిక్స్ వేసి సీసీ వేయడానికి రెడీ చేశారు. ఆ రోడ్డు వల్ల హుండాయ్ షో రూమ్ సర్వీస్ సెంటర్ కి రెండు గేట్స్ మరియు మేయర్ అమర్ సింగ్ ఇంటి వెనుక గేట్ ఈ మూడింటికి తప్ప వేరే ఉపయోగం లేదు. ఇక రాంచందర్ సింగ్ నగర్ కి ఆ రోడ్ కనెక్ట్ అయినా ముందు సీసీ రోడ్డు అందుబాటులో ఉంది. అంటే ఆ కొత్త సీసీ రోడ్డు వల్ల ఉపయోగం హుండాయ్ కారు షో రూమ్ సర్వీస్ సెంటర్ వారికే అటు తర్వాత మేయర్ ఇంటికే తప్ప ప్రస్తుతం వేరే వారికి పెద్దగా ఉపయోగం లేదనే చెప్పొచ్చు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో పలు కాలనీలలో అనుసంధానం చేసే రోడ్లు గుంతలతో మట్టి రోడ్లు ఉన్నాయి, కొన్ని చోట్ల భూగర్భ డ్రైనేజి పైప్ లైన్లు వేయాల్సి ఉంది. కొన్ని చోట్ల టెండర్ అయి పనులకు నోచుకోలేదు... మరికొన్ని చోట్ల ప్రారంభించి సగం చేసి పెండింగ్ లో ఉన్నాయి. ఇక ముంపు ప్రాంతాలలో వరద మురుగు నీరు పోవడానికి పైప్ లైన్లు వేయాల్సి ఉంది. వివిధ డివిజన్ల కాలనీ ప్రజలు పలు మార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా, ప్రజా ప్రతినిధులు చెప్పినా నిధులు లేవని దాటేస్తున్నారు. మరి ఇప్పుడెలా ఇల్లు లేని దగ్గర దాదాపు అర కిలోమీటర్ సీసీ 15 ఫీట్ల వెడల్పు తో వేస్తున్నారు అని ప్రజలు డిమాండ్చేస్తున్నారు. ఇకనైనా వాణిజ్య సముదాయాలకు కాకుండా ప్రజలకు అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత ఉన్న పనులపై దృష్టి పెట్టి అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గత వారంలో జరిగిన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో మెజారిటి సభ్యులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అంతకుముందు కౌన్సిల్ ఆమోదించిన పనుల తీర్మానాలను పక్కనపెట్టి ప్రాధాన్యత లేని పనులను సొంత ప్రయోజనాల కోసం చేపట్టడం ఎంతవరకు సబబు...గత తీర్మానాలతో అభివృద్ధి పనులు చేపడితే జరిగే నష్టమేమిటి ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమీషనర్ ఇకనైనా అధికార పార్టీకీ తొత్తుగా కాకుండా ప్రజల టాక్స్ డబ్బులతో జీతాలు తీసుకుంటున్న మీరు ప్రజల కొరకు ప్రజా సమస్యలు తీర్చేవిధంగా పనులు చేయండని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.







## కొంపలు కూల్చుతున్న BRS నాయకుడు సందీప్ రెడ్డి

- వివాహితతో అక్రమ సంబంధం.. కేసు నమోదు.. చర్లపల్లి జైలుకి రిమాండ్
- మొన్న మేక పిల్ల పంచాయతీ..
- నేడు పెళ్ళైన ఆడపిల్ల పంచాయితీ..

జయభేరి, జవహార్ నగర్ :

కౌకూర్, భరత్ నగర్ కి చెందిన BRS నాయకుడు సందీప్ రెడ్డి చేస్తున్న చిల్లర చేష్టలు రోజు రోజుకి పెచ్చు మీరుతున్నాయి. భరత్ నగర్ లో చిచోర లెక్కలకు కేరాఫ్ అడ్రస్ గా సందీప్ రెడ్డి ఆగడాలు వున్నాయంటు స్థానికుల ఆవేదన. వివరాల్లోకెలితే గత కొంత కాలం క్రితం ఓ మహిళ పెంచుకుంటున్న మేకలను సందీప్ రెడ్డి అనే వ్యక్తి దొంగతనం చేసి చంపి తిన్నాడనే ఆరోపిస్తూ బాధిత మహిళ పి.యస్ లో ఫిర్యాదు చేయడమేగాక ఏకంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ ముందే సందీప్ రెడ్డి గళ్ళా పట్టుకుని చెప్పుతో కొట్టడంతో జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పుడు తన భార్యతో సందీప్ రెడ్డి అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, ఇదేందని ప్రశ్నించిన నాపై దాడి చేసి హత్యా ప్రయత్నం చేసారని స్థానిక భరత్ నగర్ కి చెందిన ఓ వివాహిత భర్త పోలీసులను ఆశ్రయించారు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు సందీప్ రెడ్డితో పాటు సహకారించిన అతని అనుచరుడు సతీష్ పై కేసు నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇవేకాక సందీప్ రెడ్డి అక్రమంగా రేషన్ బియ్యం సరఫరా చేసి అమ్మడం, పలువురుపై దాడులు చేయడంతో కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. దీంతో సందీప్ రెడ్డి మరియు అనుచరులు చేస్తున్న ఇలాంటి చిల్లర చేష్టల వల్ల స్థానికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఇంకా వుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మానవ అక్రమ రవాణాను అడ్డు కడదాం..

- రోజురోజుకు మానవ అక్రమ రవాణా పెరిగిపోతుందని ఆక్రందన
- ఒక పోలీసు వ్యవస్థ కాదు, సమాజంతో కలిసి మానవ అక్రమ రవాణాను అరికడదాం

జయభేరి, హైదరాబాద్ :

సెయింట్ మేరీస్ కాలేజీ ఆధ్వర్యంలో కస్తూరిబా డిగ్రీ మహిళా కాలేజ్ యువతులు పాల్గొని మౌన దీక్షను చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతుందని, సెంట్ మేరీస్ కాలేజ్ ఆధ్వర్యంలో వైఎన్ సిఎస్ సికింద్రాబాద్ లో భారీగా డిగ్రీ చదివే యువతి యువకులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. మనిషిని మనిషి అక్రమ రవాణా చేసే దౌర్భాగ్యస్థితికి రోజురోజుకు సమాజం పడిపోతుందని దాన్ని సమాధి చేయకపోతే రాబోయే రోజులలో మనుషులే కరువైపోయే అవకాశం ఉందని ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడారు. ఇందులో కస్తూర్బా మహిళా డిగ్రీ కాలేజీ యువతులు కూడా భారీగా పాల్గొని మౌన దీక్షను ప్రదర్శించారు.






# మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్ పరిశీలించిన బీఆర్ఎస్ బృందం

జయభేరి, మేడిపల్లి :

మూసీ పునరుజ్జీవ ప్రక్రియలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించిన నాగోల్ మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్ (ఎస్టీపి)ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మా రెడ్డి, ముఠా గోపాల్, కె.పి వివేకానంద, మాధవరం కృష్ణరావు, కాలేరు వెంకటేష్, పీర్జాదిగూడ బీఆర్ఎస్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, ప్రభాకర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లం వెంకటేష్ గౌడ్ , జగన్ రెడ్డి, కిరణ్, పలువురు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.







## సిఎంఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, కాప్రా :

డా. ఏఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 55 మంది లబ్ధిదారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 20 లక్షల 72 వేల 500 రూపాయల చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. CMRF నీ అందరూ సద్వినియోగ పరుచుకోవాలని ఆయన అన్నారు. CMRF పేదలకు వరం అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చెక్కులను తొందరగా వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐమాక్స్ లైట్ తప్పకుండా ఏర్పాటు చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

శుభం కన్వెన్షన్ నాగోల్ లో జరిగిన ఉప్పల్ మండలానికి చెందిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. MRO నూతన కార్యాలయం మరియు ఉప్పల్ ప్రభుత్వ స్కూల్ లో ఐమాక్స్ లైట్ తప్పకుండా ఏర్పాటు చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో MEO రామ రావు, హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



జయభేరి, మేడ్చల్ :

పేదవారికి సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీకి చెందిన 10 మందికి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మజూరైన రూ.3,41,00 విలువైన చెక్కులను శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ స్వామి నాయక్ తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతు వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రజలు ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ పార్టీ నిరసన

- మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్



జయభేరి, మేడ్చల్ :

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతపై నిరసనగా మేడ్చల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఉదయం చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు లు పాల్గొననున్నారని దయానంద్ యాదవ్ చెప్పారు. ఇట్టి కార్యక్రమానికి మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఇకపై అన్ని కేసులు ప్రత్యక్ష ప్రసారం..!

జయభేరి, న్యూఢిల్లీ:

ఇప్పటివరకూ రాజ్యాంగ ధర్మాసనం సీజేఐ విచారణలను మాత్రమే సుప్రీంకోర్టు లైవ్ టెలికాస్ట్ చేసింది. త్వరలో అన్ని రోజు వారీ కేసులను సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. న్యాయ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో చొరవ తీసుకున్నామని సీజేఐ డీవై చంద్రచూడ్ అన్నారు.



## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి

- మార్కెట్ కమిటీ అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నాయకులు

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ నిధులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిన మేడ్చల్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ భాజపా నాయకులు శనివారం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో మేడ్చల్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్ కు చెందిన సుమారు రూ.7 కోట్ల నిధులను దారిమళ్లించారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు మేడ్చల్ నిధులను తూప్రాన్, గజ్వేల్, శంకర్ పల్లి, జగిత్యాల, మహేశ్వరం తదితర ప్రాంతాలకు తరలించారని ఆ అప్పు కాస్త వడ్డీతో కలిపి ప్రస్తుతం దాదాపు రూ.10కోట్ల కు పైగా పెరిగిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అయిన దారి మళ్లించిన నిధులను వసూలు చేసి మేడ్చల్ రైతుల మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ నిధుల విషయంలో అధికారులతో చర్చింస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హంస రాణి, ప్రేమ్ దాస్, వంశీరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తిక్కవానిపాలెం బీచ్ లో స్వచ్ఛతా హీ సేవా

- కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికారులు,సచివాలయం సిబ్బంది



జయభేరి, పరవాడ:

గ్రామాలని పరిశుభ్రత ఉంచే ఉద్దేశ్యం తో కేంద్రం ప్రభుత్వం మొదలుపెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుండడంతో ప్రతి శనివారం ప్రభుత్వ ఉద్యోగలచే స్వచ్ఛాదంగా నిర్వహించబడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం తిక్కవానిపాలెం బీచ్ నందు పరవాడ మండల ఈవోఆర్డి ధర్నారావు అతిథిగా పాల్గొని మొదలు పెట్టారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం వలన ఎటువంటి వ్యాధులు ప్రభలకుండా ఉంటాయని అని అన్నారు.ఈ సందర్బంగా బిచ్ యందు ఉన్న చెత్తను ఎత్తి శుభ్రం చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు,సచివాలయం సిబ్బంది,డ్వాక్రా మహిళలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్థానిక పరిశ్రమలలో మత్స్యకారులకు శాశ్వత ఉద్యోగాలను కల్పించండి

- ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందజేసిన బీజేవైఎం సభ్యులు



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామానికి పల్లె పండగకి కార్యక్రమంకు విచ్చేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకి స్థానిక బీజేవైఎం సభ్యులు వినతిపత్రం అందజేస్తూ గ్రామపంచాయతీలో స్థానిక మత్స్యకారులకు గతంలో ఫార్మసిటీ, ఎన్టీపీసీ నందు శాశ్వత ఉద్యోగాలను దశల వారీగా కల్పిస్తామని చెప్పిన కంపెనీ యాజమాన్యాలు నేటికీ అమలకు నోచుకోలేదని చేపల వేట సాగక,పూట గడవక పస్తులు ఉండే పరిస్థితి వస్తుంది అని ఫార్మా కంపెనీల వ్యర్థాలను పైప్ లైన్ ద్వారా సముద్రంలో కలవడం అలాగే ఎన్టీపీసీ ఫ్లె యాస్ బూడిదను ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి విడుదల చేయటం వలన మత్స్య సంపద నాశనం అవుతుందని పెద్ద ఎత్తున చేపలు మృత్యువాత పడడం వలన మత్స్యకారులు జీవనోపాధి పోయి సాంప్రదాయ మత్స్యకారుడు కనుమరుగయ్యే పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని కావున ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఉద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించి మత్స్యకారులకు జీవనోపాధి కల్పించుటకై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ యొక్క కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి మోస రామకృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు గట్టుకు గండి పూడ్చివెత




జయభేరి, పరవాడ :

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పి బోనంగి గ్రామపంచాయతీలో భారీ వర్షాలకు గండి పడిన కన్నయ్య చెరువు గట్టును స్థానిక సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన అధికారులు చెరువుకు గండి పడిన చోట నీరు వృధాగా పోకుండా రహదారిపైకి నీరు రాకుండా పూడ్చడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో ఇరిగేషన్ జె ఈ సాయి కిరణ్, డి ఈ సత్యనారాయణ, వర్క్ ఇన్స్పెక్టర్ రాజు, పి బోనంగి ఉపసర్పంచ్ గౌంతిన రాము, బోకం సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ గ్యాస్ పక్కదారి



- హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు
- ఒక్కో బండకు రూ.200పైనే వసూళ్లు..
- అక్రమంగా సిలిండర్లు అమ్ముకుంటున్న గ్యాస్ డెలివరీ బాయ్స్..




జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ లో 'డొమెస్టిక్' గ్యాస్ సిలిండర్ల దందా కమర్షియల్గా సాగుతోంది. గృహావసరాలకు వినియోగించే(డొమెస్టిక్) సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి. ఈ వ్యాపారం ప్రధానంగా మున్సిపాలిటీ కేంద్రాల్లో జోరుగా నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లలో, ఫాస్ట్ఫుడ్, టిఫిన్ సెంటర్లలో ఇంటి సిలిండర్లను దొంగచాటున వినియోగిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుండడంతో పాటు కొంత మంది ఏజెన్సీదారులకు తెరచాటున ఇదొక వ్యాపారంగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ దారులకు సరఫరా చేస్తున్న వంట గ్యాస్ పక్కదారి పడుతున్నది. వాణిజ్య సిలిండర్ల గ్యాస్ ధరతో పోలిస్తే గృహ వినియోగ గ్యాస్ ధర తక్కువ వుండడంతో హోటళ్లు, రెస్టారెంట్ లు, టీ, కాఫీ దుకాణాలు, పకోడీ, తదితర చిరువ్యాపారులు వీటిని వినియోగిస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ బాయ్స్ ఒక్కో సిలిండర్కు రూ.200 వరకు అదనంగా తీసుకుని సిలిండర్ ఇస్తున్నారని ఆయా వ్యాపారులు చెబుతున్నారు. అయితే డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా నిరంతరంగా తనిఖీలు చేయాల్సిన సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇటీవల కాలంలో తనిఖీలు చేయడం మానేశారు. ఎప్పుడో ఒకసారి తూతుమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దుకుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం గృహ, వాణిజ్య అవసరాలకు వంట గ్యాస్ను వేర్వేరుగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఇళ్లల్లో వినియోగించే గ్యాస్ సిలిండర్ ఎరుపు రంగులో వుంటుంది. గృహేతర అవసరాలకు అంటే హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్, పరిశ్రమలు, తదితర వాటికి వాణిజ్య సిలిండర్లను వాడాలి. ఇవి నీలం రంగులో వుంటాయి. అయితే గృహ వినియోగ గ్యాస్తో పోలిస్తే వాణిజ్య గ్యాస్ ధర ఎక్కువగా ఉంటుంది. దింతో వ్యాపారులు దొడ్డిదారిన గృహ వినియోగ గ్యాస్ను వినియోగిస్తున్నారు. ఇందుకు గ్యాస్ డెలివరీ బాయ్స్ సహకరిస్తున్నారు. వంట గ్యాస్ సిలిండర్ బుకింగ్కు ఆన్లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి ఆన్లైన్లో గ్యాస్ బుక్ చేస్తేనే సిలిండర్ డెలివరీ చేయాలి. కానీ హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కన వుండే టిఫిన్ సెంటర్లు, పకోడి బళ్ల వద్ద గృహవినియోగ గ్యాస్ సిలిండర్లు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. ఇటువంటి వాటిని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసే అధికారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులకు వుంటుంది. కానీ ఇలాంటి వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



# చార్జీలు పెంపుపై తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

- విద్యుత్ ఛార్జీలు పెంపు ప్రతిపాదన ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- సిపిఎం మండల కమిటీ నాయకురాలు మాణిక్యం డిమాండ్




జయభేరి, పరవాడ:

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి విద్యుత్ నియంత్రణ మండలి గ్రామాలలో ప్రజాభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా నిర్వహించిందని దీనిని నిరసిస్తూ శనివారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిపిఎం ధర్నా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పరవాడ మండల కమిటీ నాయకురాలు పి మాణిక్యం మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి 8114 కోట్ల రూపాయలు ఇంధన సర్దుబాటు చార్జీలు పేరుతో గతంలో 2022, 23 సంవత్సరంలో వాడుకున్న కరెంట్కు ఇప్పుడు రెండు కోట్లమంది వినియోగదారుల మీద భారం వేయడం చాలా దుర్మార్గమైయినా చర్యని దీని కోసం గ్రామాలలో చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ పేరుకేనని మొక్కుబడి తంతులాగా బహిరంగ విచారణ జరిపించి గతంలో 2022 23 సంవత్సరంలో వాడిన కరెంటుకి ఈ రోజు బిల్లులు కట్టిస్తే ప్రజల కట్టిన బిల్లులు డబ్బులు చాలలేదని మళ్లీ ఇప్పుడు రెండేళ్ల తర్వాత జనం వద్ద వసూలు చేయటానికి ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేదని అసలు ఈ విధానమే తప్పు అని గతంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న ఈ కూటమి పార్టీలు ఆ విధానాన్ని రద్దు చేయాలని ఆ నాడు బాదుడే బాదుడు పేరుతో రాష్ట్రము అంతటా ఆందోళన నిర్వహించి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధం అవ్వడం అనేది చాలా సిగ్గుచేటు పని అని వెంటనే విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని ఇప్పటికే నిత్యవసర వస్తువులు కూరగాయలు ,పప్పులు, నూనెలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ వంటి ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధరలను తగ్గించవలసిన ప్రభుత్వాలు ప్రజలపై మరిన్ని భారాలు వేయడానికి పూనుకుంటున్నాయి వెంటనే ఇటువంటి విధానాలకు స్వస్తి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే నాయుడు, బి లచ్చి బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండగతో గ్రామాలలో ప్రగతికి బాటలు

- ముత్యాలమ్మపాలెం పర్యటనలో ఎమ్మెల్యే పంచకర్ల



జయభేరి, పరవాడ:

పెందుర్తి నియోజకవర్గం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతిలో పల్లె పండగ పంచాయతి వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకి సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యంలో మహిళలతో హారితి ఇచ్చి ఘన స్వాగతం పలికారు అనంతరం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి 4, 500 కోట్లు కేటాయించారని ఈ నిధులతో ప్రతి పంచాయతీలను సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైలా జగన్నాధరావు,మాజీ ఎంపిపీలు మాదంశెట్టి నీలబాబు,మానవరపు అప్పలనాయుడు,తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను,ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి, బంగారురాజు,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న , వైస్ ప్రెసిడెంట్ పెంటయ్య,మరియు ఎన్డీఏ కూటమి నాయకులు మండలంలో గల సర్పంచ్లు, ఎంపిటీసిలు,ఎంపీడీవో , ఈవోఆర్డి,ఇంజనీరింగ్అధికారులు ,డ్వాక్రా సీఏ లు ,అంగన్ వాడీ కార్యకర్తలు ,సచివాలయం సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన నాయకులను అరెస్ట్ అప్రజాస్వామికం

- బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు

జయభేరి, దేవరకొండ :

గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐపీఎస్, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ , ఇతర BRS పార్టీ నాయకులను అరెస్ట్ అప్రజాస్వామికం అని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ తీసుకొచ్చిన 95 శాతం లోకల్ రిజర్వేషన్లు తుంగలో తొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహారం ఉంది అని ఆయన అన్నారు.తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాకుండా వికీపీడియా ప్రామాణికం అంటుండటం బాధాకారం అని అన్నారు.గత నాలుగు రోజులుగా ఎండ, వానా అనక ఆందోళన చేస్తున్న గ్రూప్1 అభ్యర్థుల విషయంలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయం, బాధాకారం అన్నారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థుల్లో చాలా మంది రేపు ఉన్నతాధికారులు కాబోతున్నారు. వాళ్లను గొడ్ల మాదిరిగా లాక్కెళ్లుతూ కొడుతుండటం బాధాకరం అని,ఏ కారణం చేత మేము మొండిగా ఉన్నామో అన్నది అభ్యర్థులను పిలిచి కనీసం వాళ్లకు వివరణ ఇవ్వకపోవటం శోచనీయం, దారుణం అని అన్నారు. ఏ రాహుల్ గాంధీ, ఏ రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు అశోక్ నగర్కు వెళ్లి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ పొంకనాలు కొట్టి గెలిచారు కానీ ఇప్పుడు వాళ్ల మాటలు కూడా ఆలకించని పరిస్థితి చూసి తెలంగాణ యువత క్షోభిస్తోంది అని తెలిపారు.ఉన్నతాధికారులు కావాల్సిన యువతతోనే ఇలా వ్యవహరిస్తున్నారంటే.. మిగతా యువతతో ఎలా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవాలి అని,రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి వారితో మాట్లాడాలి అని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇంత మొండిగా, మూర్ఖంగా వ్యవహరించకుండా అభ్యర్థులతో చర్చలు జరపాలి. సాహేతుకమైన కారణాలు చెప్పాలి అని కోరారు.లేదంటే వాళ్లు డిమాండ్ చేస్తున్నట్లుగా ఎగ్జామ్స్ను పోస్ట్ పోన్ చేయాలి అని,వాళ్లు ఊరికే వాయిదా వేయమని కోరటం లేదు. మధ్యప్రదేశ్లో ఇలాగే జరిగితే కోర్టు తీర్పు తర్వాత మళ్లీ పరీక్ష నిర్వహించే పరిస్థితి వచ్చింది అని,ప్రజా పాలన అంటూ పొంకనాలు కొట్టిన రేవంత్ రెడ్డి ఎందుకు ఈ నిరంకుశ నిర్బంధాలు ఎందుకు చర్చలు జరిపేందుకు భయపడుతున్నావ్. ఎందుకు నాయకులను అరెస్ట్ చేసి గొంతునొక్కే ప్రయత్నాలు చేస్తున్నావ్ అని అన్నారు.ఇకనైనా సిగ్గు తెచ్చుకొని ప్రభుత్వం అభ్యర్థులతో చర్చలు జరపాలి. వాళ్ల వాదన విని ఎగ్జామ్స్ వాయిదా వేయాలి అని డిమాండ్ చేశారు.

# తుమ్మల వ్యాఖ్యలకు భగ్గుమన్న బిఆర్ఎస్

- రైతు భరోసా వెయ్యండి.. లేదంటే రైతులతో కలిసి పోరాటం చేస్తాం
- వానాకాలం రైతుబంధు వేయలేమన్న వ్యాఖ్యలపై నిరసన
- గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో రేవంత్ దిష్టిబొమ్మ దగ్ధం

✍ **జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 19 :**



వానాకాలం రైతు భరోసా వేయడం సాధ్యం కాదని మాట్లాడిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలకు నిరసనగా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బారస పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిపోతున్నా మ్యానిఫెస్టోలో చెప్పిన ఏ పథకాన్ని సరైన రీతిలో ఆమలు చేయడం లేదన్నారు. రైతును అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకువచ్చి రాజును చేయాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకానికి మేము అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో ప్రతీ పంట కాలానికి రూ 7500 సంవత్సరానికి రూ 15వేల ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ ఇచ్చిన 5వేల రూపాయలను కూడా ఇవ్వమని చెప్పడం రైతులను మోసం చేయడమే అన్నారు. డిసెంబర్ 9 తారీకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమలు చేస్తామని చెప్పిన ఋణ మాఫీ సగంలోనే ఆగిపోయిందని అన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని, రైతు కూలీలకు 12వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చి ఒక వైపు అప్పుల ఊబిలోకి నెట్టి మరోపక్క మూసి సుందరీకరణ పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని లూటి చేసే ఆలోచన చేస్తుందని అన్నారు. రైతు భరోసా ఇవ్వలేని ప్రభుత్వం మూసి సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లు ఎక్కడి నుండి తెస్తుందని ప్రశ్నించారు. వెంటనే వానాకాలం రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయాలని లేని పక్షంలో రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దిన్, ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెండె మధు, కృష్ణా గౌడ్, నాయకులు బయ్యారం శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, బొగ్గుల చందు, గుంటుకు రాజు, రఘపతి రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, కనకయ్య, రమేష్, అహ్మద్, ఉమర్, సంతోష్ రెడ్డి, బీరప్ప, కల్యాంకర్ శ్రీనివాస్, నరేష్, హన్మంత్ రెడ్డి మురళి, బాల్ రాజు , మాధవ రెడ్డి, అమర్ తదితరులు పాల్గొన్నారు



## నేడు కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం

✍ **జయభేరి, దేవరకొండ :**

ఎకరానికి 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరుని ఎండగట్టాలని నిరసనగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. దేవరకొండ పట్టణంలో బస్ స్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరుకానున్నారు. కావున మండలాల అధ్యక్షులు, మండలాల బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువజన, మహిళ, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని మాజీ ఎమ్మెల్యే తెలియజేసినారు.

## రేషన్ కార్డు ఉంటే బియ్యం, గోధుమలు

✍ **జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 19,:**

తెలంగాణ ప్రభుత్వం హామీల అమలులో భాగంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుల ద్వారా పేదలక ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నాయి. పేదలు వాటిని తినకుండా అమ్మేస్తున్నారు. దీంతో అవి చివరకు రైస్ మిల్లులు లేదా మహారాష్ట్రకు తరలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మిల్లర్ల రీసైక్లింగ్ దందాకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. జనవరి నుంచి దీనిని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. తాజాగా రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు సన్న బియ్యం పంపిణీపై స్పష్టత ఇచ్చారు. జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న అందరికీ ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున బియ్యం అందిస్తామని తెలిపారు. త్వరలో జారీ చేసే ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారికి ప్రస్తుతం బియ్యం ఒక్కటే పంపిణీ చేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రేషన్ కార్డుపై పేదలకు సబ్సిడీ ధరకు చక్కెర, బియ్యం, గోధుమలతోపాటు 9 రకాల సరుకులు పంపిణీ చేసేవారు. తాజాగా కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో పేదల కోసం బియ్యంతోపాటు మరికొన్ని సరుకులు ఇవ్వాలని భావిస్తోంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. రేషన్ కార్డు పేదలకు మాత్రమే ఉంటుందని, రేషన్ కార్డుకు, ప్రభుత్వ పథకాలకు సంబంధం ఉండదని తెలిపారు, ఆరోగ్యశ్రీతో కూడా రేషన్ కార్డుకు సంబంధం లేదని తెలిపారు. త్వరలోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్డుల ఆధారంగానే అర్హులను గుర్తిస్తామని వెల్లడించారు. రేషన్ కార్డు ఉన్నవారే పథకాలకు అర్హులనే అపోహలు వీడేలా డిజిటల్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్డులో ఫ్యామిలీ పూర్తి సమాచారం ఉంటుందని పేర్కొన్నారు.

# గజ్వేల్ అంటే అప్పుడు గొప్పలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిప్పలు

- ప్రభుత్వ దవాఖానాలు.. నడపలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం..
- గత ప్రభుత్వంలో గజ్వేల్ గురించి గొప్పలు చెప్పుకున్నాం. కానీ ఇప్పుడు తిప్పులు పడుతున్నాం
- తెలంగాణ రాష్ట్ర మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి

✍ **జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 19 :**



గత ప్రభుత్వం పాలనలో ఉన్నప్పుడు గజ్వేల్ నియోజకవర్గం గురించి గొప్పలు చెప్పుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిప్పలు పడుతున్నామని రాష్ట్ర ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళిలు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వైద్య సేవలు కూడా అందించలేని దౌర్భాగ్యంలో ఉందని అలాగే పూర్తిస్థాయిలో వైద్యం అందాక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శనివారం మాతా శిశు ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించి వైద్యుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో జిల్లా స్థాయి దావఖానలను అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దే అన్నారు. గతంలో ప్రభుత్వ దావకానలోనూ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందాయని ప్రస్తుతం దవఖానలలో సరిపోయే మందులు కూడా ఇవ్వక ప్రైవేటుగా కొనుక్కోవాల్సి వస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి బాలింతలకు కిట్లను కూడా పంపిణీ చేయడం లేదన్నారు. సొంత దందాలు చేయడానికి పోటీపడుతున్న కాంగ్రెస్ నాయకులు వైద్యానికి నిధులు వెచ్చించడానికి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గజ్వేల్ లో రూ.33 కోట్లతో మాత శిశు దవఖాన కేసీఆర్ నిర్మిస్తే కనీసం వాటిలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అవసరమైన పూర్తిస్థాయి మౌలిక వస్తువులను పది రోజుల్లో ఏర్పాటు చేసి అన్ని సేవలు అందించాలని, లేనిపక్షంలో ఆసుపత్రి ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దీన్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, బొగ్గుల చందు, నాయకులు నవాజ్ మీరా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# చౌదర్పల్లి ప్రభుత్వ స్కూల్లో ఎల్ఈడి టీవీ, స్క్రీన్ అందజేత..

- పేద విద్యార్థుల అభ్యున్నతే తమ ట్రస్టు లక్ష్యం
- చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్

✍ **జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 19 :**




గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థుల అభ్యున్నతే తమ లక్ష్యమని తలకొక్కుల చంద్రకళ, లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం చౌదరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎల్ఈడి టివి, స్క్రీన్ అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతుండగా, పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు, పాఠశాలల్లో తాగునీటి వసతులు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్ పంపిణీ, ఎల్ఈడి టీవీల అందజేత తదితర కార్యక్రమాలు చేపట్టి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఉన్నత విద్య కోసం ఆర్థికంగా ప్రోత్సహిస్తుండగా, తాను చిన్నతనంలో పడిన కష్టాలు నేటితరం పేద విద్యార్థులు పడకూడదనే లక్ష్యంతో వారి అభ్యున్నతికి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతోపాటు దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్, ట్రస్ట్ నిర్వాహకులు దుర్గా ప్రసాద్, మధు సూధన్ ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్లండి శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.






## అక్కారం లో బిఆర్ఎస్ ఖాళీ

- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

✍ **జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 19 :**

అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కటకం రాజు, బుడిగ ఎల్లయ్య, దప్పు ప్రశాంత్, బుడిగే లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి అక్కరం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు, నాయకులు రామా గౌడ్, మాజీ ఎంపీటీసీ కవిత రాజు, యాదగిరి, రాజు హనుమంత్, రమేష్, పోచయ్య, ప్రసాద్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సహాయకులకు శిక్షణ పూర్తి

- స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- నిర్లక్ష్యం చేస్తే గ్రామాల్లో రోగాలు ప్రబలే అవకాశం
- మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రాజు



✍ **జయభేరి, గజ్వేల్ వర్గల్, అక్టోబర్ 19 :**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రాజు స్పష్టం చేశారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా సహాయకులకు వర్గల్ ఎంపీపీ సమావేశం మందిరంలో నాలుగు రోజుల శిక్షణ అనంతరం శనివారం మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఏఈ శ్రీధర్ తో కలిసి సర్టిఫికెట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా సహాయకుల పాత్ర ఎంతో కీలకమని, వారు నిర్లక్ష్యం చేయకుండా శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అయితే త్రాగునీటి కలుషితంతో అతిసార, కలరా, కామెర్లు, టైఫాయిడ్, ఫ్లోరోసిస్, చర్మ వ్యాధులు, కండరాల నొప్పులు, బలహీనత, పక్షవాతం, ఊపిరితిత్తులు, క్యాన్సర్ సంబంధిత తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తూ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, త్రాగునీటిని టెస్టింగ్ చేయడం, పథకం నిర్వహణ, నీటి సంరక్షణ, నీరు వృధా కాకుండా చూడడం, ట్యాంకుల్లో పేరుకుపోయిన సిల్ట్, బురద, మలినాలు, తొలగించడం, బ్లీచింగ్ చేయడం, ట్యాంకుల్లోకి పక్షులు ఇతర కలుషిత పదార్థాలు చేరకుండా మూతను సరిగా బిగించడం, నీటి భద్రత చర్యలు చేపట్టడం, ట్యాంకులను శుభ్రపరచిన అనంతరం రీ ఫీల్లింగ్ ప్రక్రియ ప్రారంభించడం తదితర అంశాలకు సంబంధించి రికార్డులు నిర్వహించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాళీం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలను ప్రోత్సహించండి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



✍ **జయభేరి, గజ్వేల్ ములుగు, అక్టోబర్ 19 :**

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించడంతోపాటు, వైవిధ్దీకరణలో భాగంగా ఉద్యాన పంటలను భారీగా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా పదవి బాధ్యతలు తీసుకున్న డాక్టర్ దండ రాజిరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఒకే సాగు భూమిలో బహుళ పంటల సాగుతో రైతుల ఆదాయాలు పెంచే ఉత్తమమైన మార్గమని, దీనికి విశ్వవిద్యాలయం వెన్నుదన్నుగా ఉండి రైతుల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్య పంటలను మల్టీ స్టోరిడ్ పద్ధతిలో సాగు చేసుకునేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ప్రత్యేకించి వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్, ఇతర తోట పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. పెట్టిన పెట్టుబడి తక్కువ కాలంలోనే రైతుకు తిరిగి రావాలంటే ఉద్యాన పంటలు మార్గమని తెలిపారు.

## కేటీఆర్.. హరీశ్ రావు కు కౌంటర్ ఇచ్చిన మంత్రి సీతక్క

✍ **జయభేరి, హైదరాబాద్:**

మూసీ ప్రక్షాళన పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ చేస్తున్నారన్న కేటీఆర్, హరీశ్ రావు వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. గతంలో రియల్ ఎస్టేట్ పేరుతో హైదరాబాద్ చుట్టూ కేటీఆర్ ప్లాట్లు అమ్ముకున్నారని అన్నారు. అప్పుడు ప్లాట్లు అమ్ముకోవడం వల్లే ఇప్పుడు రియల్ ఎస్టేట్ అని వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. తెలంగాణ పునర్జీవనం అని మాట్లాడిన హరీశ్ రావు. అది ఎక్కడ చేశారో చూపించాలని ప్రశ్నించారు.




# స్త్రీ 3 ఆగమనం షురూ..

'స్త్రీ' బాగా ఆడింది. నిర్మాతలకు డబ్బులు, పనిచేసిన వారికి పేరు తెచ్చిపెట్టింది. మొదట్లో ఈ సినిమాకు సీక్వెల్ చేయాలన్న ఆలోచన లేదు. ఆ ఊహ కూడా ఎవరికీ రాలేదు. ఓరోజు దర్శకుడు అమర్ కౌశిక్ 'స్త్రీ 2' కథ చెప్పాడు. కాసేపు షాక్‌లో ఉండిపోయా. తను ఇంత కొత్తగా ఎలా ఆలోచించాడా?! అనిపించింది. అయితే.. ఇంతటి సక్సెస్ మాత్రం ఊహించలేదు. అసలు ఓ హారర్ కామెడీ సినిమాకు 900కోట్లు రావడమేంటి? బాలీవుడ్‌లో ఎవరికీ మింగుడు పడని విజయం ఇది.' అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్. ఇంకా ఆమె మట్లాడుతూ ' 'స్త్రీ 2' విజ యం మా టీమ్ అందరికీ సొంతం. స్క్రిప్ట్ బావుంటే కాస్టింగ్‌ను కూడా ప్రేక్షకులకు పట్టించుకోరని 'స్త్రీ 2' రుజువు చేసింది. మూడో పార్ట్‌లో ఎంటర్టైన్మెంట్ ఇంతకు మించి ఉంటుంది. పనులు కూడా మొదలయ్యాయి. చాలా డెవలప్‌మెంట్లు జరిగాయి కూడా.' అంటూ 'స్త్రీ 3'కు సంబంధించిన అప్‌డేట్‌ని ఆడియన్స్‌కి అందించింది శ్రద్ధాకపూర్.





# అనసుయపై ఆసక్తికర వ్యాఖ్యలు

జబర్దస్త్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటిస్తూ.. నిర్మిస్తున్న తాజా చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ సినిమాకు 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహిస్తుండగా.. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుంది. ఈ మూవీ నుంచి నేడు ట్రైలర్ విడుదల చేయగా.. యూట్యూబ్‌లో మంచి వ్యూస్‌తో దూసుకుపోతుంది. అయితే ఈ మూవీ ట్రైలర్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన హృదయ కాలేయం, బేబీ చిత్రాల దర్శకుడు సాయి రాజేష్ వేదికపై ఉన్న యాంకర్ అనసుయపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జబర్దస్త్ కామెడీ షోలో నేను అనసుయ చాలా రోజులు కలిసి పనిచేశాం. అయితే ఒకరోజు అనసుయతో ఫొటో దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. అది చూసి చాలామంది నేను అనసుయ భర్త అనుకున్నారు. దీంతో నన్ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. అనసుయ ఎక్కడ నువ్వు ఎక్కడా అంటూ కామెంట్లు చేశారు. తర్వాతి నేను క్లారిటీ కూడా ఇచ్చాను అంటూ సాయి రాజేష్ చెప్పుకోచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# ఉద్వేగపూరితంగా జాత్

బాలీవుడ్ స్టార్ సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ పాన్ ఇండియా చిత్రానికి 'జాత్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది సన్నీడియోల్ వందవ చిత్రం కావడం విశేషం. సన్నీడియోల్ రీసెంట్ హిట్ 'గద్దర్ 2' 60 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, దాదాపుగా 700కోట్ల వసూళ్లను రాబట్టి భారీ విజయాన్ని నమోదు చేసింది. 'గద్దర్ 2' తర్వాత వస్తున్న సన్నీడియోల్ సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సన్నీడియోల్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సన్నీడియోల్ పవర్‌ఫుల్‌గా, ఉద్వేగపూరితమైన రూపంలో కనిపిస్తున్నారు. శరీరమంతా రక్తపు మరకలతో ఓ పెద్ద ఫ్యాన్‌ని పట్టుకొని ఉన్న ఈ పోస్టర్ మాస్ ప్రేక్షకులకు నచ్చేలా ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. రణదీప్ హుడా, వినీత్ కుమార్‌సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబి, సంగీతం: ఎస్.థమన్,

# డ్యాన్సింగ్ వార్

'దేవర' హడావిడి ప్రస్తుతానికి ముగిసింది. ఇప్పుడు తారక్ దృష్టి అంతా 'వార్ 2' మీదే. అందుకే.. లుక్ మార్చేశాడు. రీసెంట్‌గా 'వార్ 2'కోసం ముంబై ఫ్లయిట్ ఎక్కేశాడు. ఈ కొత్త షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై ఓ పాటను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నారట. హృతిక్, తారక్ ఇద్దరూ గొప్ప డ్యాన్సర్సే. అందుకే.. అబ్బురపరిచే డ్యాన్స్ మూమెంట్స్‌తో ఈ పాటను డిజైన్ చేశారట. ప్రస్తుతం ముంబైలో ఈ పాట షూటింగ్ జరుగుతున్నది. డ్యాన్స్ లవర్స్ పండుగ చేసుకునేలా ఈ పాట ఉండబోతున్నదని టాక్. ఇప్పటికే తారక్, హృతిక్‌లపై భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌ని కూడా పూర్తి చేశారు. ఓ వైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్ట్ 14న సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు 'యుద్ధభూమి' అనే టైటిల్ అనుకుంటున్నట్టు తాజా సమాచారం. పాన్ ఇండియా సినిమాలు ఒకే టైటిల్‌తో అన్ని భాషల్లో విడుదల అవుతున్న రోజులివి. అయితే.. తారక్‌ది ఇందులో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ కాబట్టి, ఆయన్ను దృష్టిలో పెట్టుకొని తెలుగు టైటిల్ పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారనేది బీటౌన్ టాక్. నిజానికి 'యుద్ధభూమి' ఇక్కడ కొత్త టైటిలేం కాదు. గతంలో చిరంజీవి హీరోగా ఇదే పేరుతో ఓ సినిమా వచ్చింది. 'వార్ 2' అనేది కూడా యూనివర్సల్ టైటిల్. ఫైనల్‌గా అదే ఖరారయ్యే అవకాశం కూడా లేకపోలేదు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com